24)సామంతం/ద్విజావంతి

ప॥ నీయంత వాడనా నేను నేరము లేమెంచేవు। యీయెడ నిరుహేతుక కృప జూడు నన్నును॥

చ॥ నిరతి నిన్నెఱుగను నీవు నన్నెఱుగుదువు। ధర యాచకుడ నేను దాతవు నీవు।
వరుస నీచుడ నేను వైకుంఠపతివి నీవు। నరుడ నేను నీవు నారాయణుడవు॥

చ॥ సారె నలసుడ నేను సర్వశక్తివి నీవు। ధీరుడవు నీ వతి దీనుడ నేను।
కారుణ్య మూర్తివి నీవు కఠిన చిత్తుడ నేను। మేరతో నీ వేలికవు మీ దాసుడ నేను॥

చ॥ జనక శీలుడ నేను జనకుడవు నీవు। ఘనవేదాంత నిధివి కర్మిని నేను।
అనిశము శ్రీవేంకటా చలేంద్రుడవు నీవు। పనుల నీ సంకీర్తన పరుడ నేను॥